## క్లుప్తంగా

### 'రేపటి బంద్ విజయవంతం చేయాలి'

భైంసాటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావొస్తున్నా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించలేదన్నారు. పాఠ్యపుస్తకాలు అందించడం, అన్ని ప్రభుత్వ బడులకు మనఊరు–మనబడి వర్తింపు, స్కావెంజర్ పోస్టుల భర్తీ వంటి డిమాండ్ల సాధనకు విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, ఏఐ ఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాహుల్ తదితరులున్నారు.

### లక్ష్మీనరసింహుడికి పూజలు



గుట్టపై భక్తులు

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ సమీపంలో అటవీ ప్రాంతంలో ఉన్న గుట్టపై కొలువుదీరిన లక్ష్మీనరసింహుడిని మండలంలోని కల్లెడ గ్రామస్తులు దర్శించుకున్నారు. పాడి, పంటలు, పిల్ల జల్ల బాగుండాలని మొక్కుకున్నారు. 65 ఏళ్లుగా ఏటా స్వామివారిని దర్శించుకుంటున్నట్లు కల్లెడ గ్రామస్తులు తెలిపారు.

### 'అనుమతి లేకుండా పాఠశాలలు నిర్వహించొద్దు'

భైంసాటౌన్:ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విద్యాశాఖ నుంచి అన్ని అనుమతులు పొందాలని.. లేకుంటే అన్ని చర్యలు తీసుకుంటామని ఎంఈవో సుభాష్ అన్నారు. డీఈవో ఆదేశాల మేరకు పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సోమవారం పాఠశాలకు వెళ్లి అడ్మిషన్ రిజిస్టర్, రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

### భూమిపూజ

భైంసా: బాసర మండలం సావర్‌గాం గ్రామంలో సోమవారం సీసీ, డ్రెయినేజీ నిర్మాణ పనులకు జెడ్పీటీసీ వసంత భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిందే మాధవ్‌పటేల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిని కలిసిన భోజారెడ్డి



పుష్పగుచ్ఛం అందిస్తున్న భోజారెడ్డి

ముధోల్: తెలంగాణ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జులుగా నియమితులైన ప్రకాశ్ జావదేకర్, సునీల్ బన్సల్‌ను సోమవారం ముధోల్ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, మనగుడి మనబడి ట్రస్ట్ చైర్మన్ బద్దం భోజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

### కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



మల్లేశ్‌ను సన్మానిస్తున్న భరత్‌చౌహాన్

కడెం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ పిలుపునిచ్చారు. సోమవారం కడెం హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవరికి కేటాయించినా సమష్టిగా పని చేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం నూతన మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్‌ను సన్మానించారు. భూషణం, రఫీక్, బబ్లూ, బ్రహ్మచారి ఉన్నారు.

### రూ.50వేలతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



స్తంభం ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్ పంచాయతీ పరిధిలోని వాస్తాపూర్‌లో సోమవారం సర్పంచ్ ఎర్రవ్వ సొంత ఖర్చులతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. రూ.50వేలతో ఎనిమిది స్తంభాలను కొనుగోలు చేసి బిగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు ఉన్నారు.

# అధ్వాన రోడ్లతో అవస్థలు

- కంకర తేలి గుంతలు పడిన రహదారులు
- అదుపు తప్పి కింద పడుతున్న వాహనదారులు
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు



వట్టోలి-వాస్తాపూర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



జోహర్‌పూర్ సమీపంలోని రోడ్డుపై ఏర్పడిన గుంతలు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు నిలిచి గుంతలు కన్పించకపోవడంతో పలువురు వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. తరచుగా బురదలో వెళ్తుండటంతో వాహనాలు సైతం మరమ్మతులు చేయించాల్సి వస్తోందని యజమానులు వాపోతున్నారు.

**ఆరు గ్రామాలు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు కరువు..**

మండలంలోని ధర్మోర-కన్కపూర్ (ఆరు కిలోమీటర్ల) రోడ్డుపై నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై ధర్మోర, వట్టోలి, వాస్తాపూర్, జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, కన్కపూర్ గ్రామాలున్నాయి. ఈ మార్గంలో భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. చోదకులు ఓ గుంతను తప్పించే క్రమంలో మరో గుంతలో చిక్కుకుంటున్నారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం..**

ధర్మోర- కన్కపూర్ రోడ్డుకు 15ఏళ్లుగా మరమ్మతులు చేపట్టడం లేదు. రోడ్లపై కంకర తేలి అక్కడక్కడా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

**పట్టించుకోని పాలకులు, ప్రజాప్రతినిధులు..**

ధర్మోర-కన్కపూర్ రోడ్డుపై నిత్యం ఎంతో మంది ప్రయాణిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, పాలకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరగక ముందే ఈ మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

### నరకం కనబడుతోంది



ఈరోడ్డుపై కంకర తేలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ప డుతున్నాం. రాత్రివేళ ప్రయాణించాలంటే నరకం కనబడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – ముత్యం,కన్కపూర్

### గుంతల్లో పడుతున్నాం..



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరడంతో ఎటు వెళ్లాలో తెలియడం లేదు. నీరు నిలవడంతో గుంత ఎంత లోతుగా ఉందో తెలియక అందులో పడుతున్నాం. – మహేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్

### ప్రతిపాదనలు పంపించాం

ధర్మోర-కన్కపూర్ రోడ్డు మార్గంలో మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కా గానే రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేస్తాం. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దు. – కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, నిర్మల్

# రమేశ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



రమేశ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన దివంగత డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ప్రాద్దుటూరి రమేశ్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం దిలావర్‌పూర్‌లో రమేశ్‌రెడ్డి 25వ వర్ధంతి నిర్వహించగా మంత్రి హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీసీసీబీ అధ్యక్షుడిగా రమేశ్‌రెడ్డి అనేక మంది రైతులకు మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తోపాటు విదేశాల నుంచి రమేశ్‌రెడ్డి కుటుంబసభ్యులు హాజరవగా.. మంత్రి వారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పూలమాలలతో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. మండల ప్రజలు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. డీసీసీబీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రమేశ్‌రెడ్డి 1998 జూలై10న నిర్మల్‌లో నక్సలైట్ల తూటాలకు బలయ్యాడు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి సోదరులు రవీందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, ఆయన కుమారుడు గౌతమ్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఫణీందర్ రావు, స్థానిక సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, నాయకులు కుంట గంగాధర్, పాల్దె అనిల్, ముథోల్ ముత్యం, నంద ముత్యం, సుభాశ్, రామాగౌడ్, బీజేపీ నాయకులు డి.ముత్యంరెడ్డి, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెలోకి మధ్యాహ్న భోజన కార్మికులు

- విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్న అధికారులు



ఖానాపూర్: మస్కాపూర్ పాఠశాలలో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న టిఫిన్‌బాక్సులు



ఖానాపూర్‌లో కార్మికుల బైఠాయింపు

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజనం వండి పెట్టే మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో సోమవారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండలేదు. మూడు రోజుల కిందట సమ్మె విషయం ఉపాధ్యాయులకు తెలియడంతో వారు పలు చర్యలు తీసుకున్నారు. అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచి లంచ్‌బాక్సులు తెచ్చుకున్నారు. మరికొన్ని చోట్ల కొందరు వంట చేయగా.. కొన్ని హాస్టళ్లలోనూ విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. తమకు ఎనిమిది నెలల కోడిగుడ్ల బిల్లులతోపాటు ఐదు నెలల వంట చేసిన బిల్లులు ప్రభుత్వం ఇవ్వడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.వెయ్యి గౌరవ వేతనాన్ని రూ.మూడు వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించినా అమలవడం లేదని వాపోయారు.

**విద్యార్థులకు ఇబ్బంది రానివ్వం..**

దీనిపై ఎంఈవో మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బంది పడకుండా మండలంలోని 70 శాతం పాఠశాలల్లో వంట చేయించామన్నారు. రేపటిలోగా అంతటా వంట చేసేలా చర్యలు చేపడుతామన్నారు.

**ఎంఈవో కార్యాలయం ఎదుట బైఠాయింపు..**

తమ బిల్లులను విడుదల చేసి సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బి.లక్ష్మి, జిల్లా కార్యదర్శి రాధ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 10, 11న మండల కేంద్రాల్లో, 12న కలెక్టరేట్ ముందు ధర్నాలో పాల్గొనాలని సూచించారు. పద్మ, రాజవ్వ, మంజుల, లక్ష్మి, కవిత, కళావతి తదితరులున్నారు.

కడెం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల10, 11న మండల కేంద్రాల్లో, 12న కలెక్టరేట్ ఎదుట సమ్మె చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాధ పిలుపునిచ్చారు.

## సంక్షిప్త వార్తలు

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

ముధోల్: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీరడి లక్ష్మీకి రూ.52వేలు, అబ్దుల్ మోహిద్‌కు రూ.30వేలు, ఆసిఫ్ అహ్మద్‌కు రూ.19వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రామ్‌రెడ్డి, ఖాలీద్, సురేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గౌతమ్, సంజు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన తొండకూర్ శ్రీనివాస్‌కు రూ.45వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం పంచాయతీ ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు నాలం గంగాధర్ శ్రీనివాస్‌కు చెక్కు అందించారు. కార్యక్రమంలో దేవన్న, రత్నయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

**14న మహాలక్ష్మి పండుగ**

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఈనెల 14న శ్రీమహాలక్ష్మి పండుగ మహోత్సవం తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేద బ్రాహ్మణులు, గ్రామపెద్దలు, హిందూ ఉత్సవ సమితి సభ్యుల సూచన మేరకు సమావేశంలో నిర్ణయించామన్నారు. సమావేశంలో అధ్యక్షుడు బీసీ రాజన్న, రాజేశ్వర్, శ్రీనివాస్, నర్సింహులు, రాజశేఖర్, సురేశ్ తదితరులున్నారు.

**ఓటీపీలు చెప్పొద్దు**

కుంటాల: అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఓటీపీ, ఆధార్ వివరాలు అడిగితే చెప్పవద్దని ఏఎస్సైలు రాందాస్, తారాచంద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బీడీ పరిశ్రమ, రైస్‌మిల్‌లో పని చేస్తున్న కార్మికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది సవిత, కిరణ్, రామారావ్ పాల్గొన్నారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి**

ఖానాపూర్: జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్యే రేఖానాయక్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఖానాపూర్ ప్రింట్ ,ఎలక్ట్రానిక్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం జర్నలిస్టులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు పడాల లక్ష్మినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిపురం నాగరాజు, గౌరవ అధ్యక్షులు రాచమల్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కోమట్టిపెల్లి వేణు, కోశాధికారి దాసరి కృష్ణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నోట్‌బుక్‌లు పంపిణీ**

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా ప్ర భుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నిర్మల్ పట్టణానికి చెందిన మహేంద్ర ట్రాక్టర్ షోరూం మేనేజర్ టి.రవీందర్‌రెడ్డి నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**రైతుబీమా వివరాలు నమోదు**

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, వడ్యాల్, లక్ష్మణచాంద క్లస్టర్లలో రైతుల నుండి ఏఈవోలు రైతుబీమా వివరాలు నమోదు చేసుకున్నారు. ఏవో ప్రవీణ్, ఏఈవోలు ఉమా మహేశ్వరి, సంతోష్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

### రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సీపీఎస్ ఉద్యోగుల విజయ సంకల్ప రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 16న జోగులాంబ జిల్లా అలాంపూర్‌లో ప్రారంభమైన రథయాత్ర ఈనెల 24న నిర్మల్‌కు చేరుతుందన్నారు. ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎస్ జిల్లా అధ్యక్షులు కృష్ణారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్, పీఆర్‌టీయూ నాయకులు ప్రసాద్, గంగన్న, శాంతికుమార్, రవీందర్, నర్సయ్య, లక్ష్మణ్, శేఖర్, మమత తదితరులున్నారు.

### వడ్డెరులంతా ఏకం కావాలి

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని వడ్డెర కులస్తులంతా ఏకమై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ అన్నారు. సోమవారం నిర్మల్‌లో ఆ సంఘం ఉపాధ్యక్షుడు వేముల గురవయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

**లక్ష్మణచాంద మండల కార్యవర్గం..**

ఈ సందర్భంగా లక్ష్మణచాంద మండల వడ్డెర సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణచాంద మండలాధ్యక్షుడిగా మక్కల నాగన్న, ఉపాధ్యక్షుడిగా అలకుంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దేవల సురేశ్, కార్యదర్శిగా వల్లపు రవీందర్, సభ్యులుగా రవి, రాజు, గంగన్న, శివరాజ్, నరేశ్, సుధాకర్, బక్కన్న, లక్ష్మి, చిన్నమ్మ, పోసాని తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.

## అటెన్షన్ ప్లీజ్..

### చినుకులకే రోడ్డంతా చిత్తడి



తానూరు: తానూరు-బెల్‌తరోడా ఎక్స్‌రోడ్డు నుంచి బోల్సా గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. వర్షపునీరు నిలుస్తుండటంతో గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు కింద పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : జగదీష్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

# వీడీసీపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

భైంసాటౌన్: భైంసా మండలంలోని మహాగాం గ్రామ వీడీసీపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు ధర్నా చేపట్టారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆటోవాలాలు ఆటోలు నడపవద్దంటూ వీడీసీ సభ్యులు బహిష్కరించారని, దీంతో తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని వాపోయారు.

**ఎస్సై హామీతో విరమణ..**

అక్కడికి చేరుకున్న రూరల్ ఎస్సై సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు సిరాజ్, మజర్, సాయినాథ్, శంకర్, భీంరావు తదితరులున్నారు.

# ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: స్వామి వివేకానందుడి మాటలను ఏబీవీపీ తన బాటగా మలుచుకుందని ఆ సంఘం ఇందూర్ విభాగ్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్ అన్నారు. సోమవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ 1949 జులై 9న ఢిల్లీ యూనివర్సిటీలో పురుడు పోసుకొని, దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా విరాజిల్లుతుందన్నారు. జ్ఞానం శీలం, ఏకత, అనే మూడు పదాలను వేదాలుగా మలుచుకొని జాతీయ పునర్నిర్మానం కోసం విద్యార్థి పరిషత్ పని చేస్తోందన్నారు. దేశంలో విద్యారంగ సమస్యలపై పోరాడుతూ పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ శశి, నగర కార్యదర్శి జశ్వంత్, నగర హాస్టల్ కన్వీనర్ దినేశ్, వంశీ, సన్నీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# వీల్‌చైర్లు, బస్‌పాసులు అందజేత



విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ రెండు వీల్‌చైర్‌లు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో చదువుతున్న బాదన్‌కుర్తి, సుర్జాపూర్, ఎక్బాల్‌పూర్, ఖానాపూర్‌కు చెందిన 185 మంది విద్యార్థులకు(ఒక్కొక్కటి రూ.50) పాఠశాలలో బస్‌పాసులు అందజేశారు. అనంతరం ఇటీవల ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. శ్రావణ్, సాబిర్, దివాకర్, ప్రసాద్, బల్గం రమేశ్, వీరేశ్, చిప్ప దేవన్న, వంశీ, రమేశ్, దయాకర్, సుమన్, మజర్ ఖాన్, షేక్ అజర్, గంగసాగర్, శ్రీనివాస్, శంకర్, ఎర్రన్న, హెచ్‌ఎం బాలాజీ తదితరులున్నారు.

# పకడ్బందీగా హరితహారం నిర్వహించాలి

తానూరు: మండలంలో హరితహారం పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలకు సమావేశం నిర్వహించారు. వర్షాలు కురిస్తే గ్రామాల్లో మొక్కలు నాటించాలన్నారు. ప్రతి పంచాయతీలో ఇంకుడుగుంతలు నిర్మించాలని సూచించారు. మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: హరితహారం విజయవంతం అయ్యేలా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో మల్లేశ్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, ఏపీవో రమేశ్ తదితరులున్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ వనజకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ వనజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, సూపరింటెండెంట్ అనంత విశ్వేశ్వర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

కడెం: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు మద్దతు పలికారు. ఐఎఫ్‌టీయూ నాయకులు భూక్య విలాస్, లింగన్న తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు సన్మానం

మామడ: మండలంలోని కొరిటికల్ పాఠశాల విద్యార్థినులు అభిజ్ఞరెడ్డి, శ్రీహర్షిని బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. సోమవారం వారిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఎస్ఎంసీగా ఎంపికైన చైర్మన్ రాజసాగర్‌ను సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ అందె సౌజన్య, ఉపసర్పంచ్ శిరీష, రత్నయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.